సాక్షి అన్నమయ్య జిల్లా

శనివారం । 16 । నవంబర్ । 2024



ఆదివాసీల ఆరాధ్యుడు బీర్సా ముండా

ఆదివాసీల ఆరాధ్యుడు. హక్కుల కోసం పోరాడిన మహనీయుడు బీర్సా ముండా అని జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శరాజేంద్రన్ కొనియాడారు. -10లో



ఇసుక క్వారీ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయండి

ఒంటిమిట్ట మండలం గొల్లపల్లి ఇసుక క్వారీ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని వైఎస్ఆర్ జిల్లా జేసీ అతిథి సింగ్ ఆదేశించారు. -10లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.220	రూ.300
రెండోరకం	రూ.140	రూ.220



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 225 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	525	530
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 141.680 కిలోలు

న్యూస్‌రీల్

30లోగా దరఖాస్తు చేసుకోవాలి

రాయచోటి (జగదాంబసెంటర్): 2024–25 విద్యా సంవత్సరానికి పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం అర్హులైన విద్యార్థులు నూతన, రెన్యూవల్ రిజిస్ట్రేషన్ కోసం జ్ఞానభూమి లాగిన్‌లో ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని అన్నమయ్య జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారి ఎస్.జయప్రకాష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని కళాశాల యాజమాన్యం వారి కళాశాలలోని విద్యార్థుల నూతన, రెన్యువల్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఈ నెల 30లోగా పూర్తి చేయాలన్నారు. దరఖాస్తు విషయంలో ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత కళాశాలలో లేదా స్థానిక సచివాలయంలో లేదా జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన తెలియజేశారు.

జిల్లాలో ఇసుక కొరత లేదు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్

రాయచోటి: అన్నమయ్య జిల్లాలో ఇసుక కొరత లేదని, స్థానిక అవసరాలకు ఉచితంగా ఇసుకను తీసుకెళ్లడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ మైనింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనాకు వివరించారు. శుక్రవారం విజయవాడ నుంచి ఇసుక అంశంపై మైనింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. జిల్లాలో ఐదు ఇసుక రీచ్‌లు ఉన్న విషయాన్ని కలెక్టర్ తెలిపారు. ఇందులో మూడు ఇసుక రీచ్‌లు పని చేస్తున్నాయని, అందులో అవసరమైన మేర ఇసుక లభ్యత అందుబాటులో ఉందన్నారు. అలాగే వీరబల్లి మండల పరిధిలోని వీరబల్లి, మట్లిలో త్వరలో ఇసుక రీచ్‌లు ప్రారంభిస్తామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, మైనింగ్ శాఖ ఏడీ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నాగరాజు

సిద్దవటం: పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దూరమవుతాయని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. మండలంలోని పి.కొత్తపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, టక్కోలి ఆరోగ్య ఉపకేంద్రం పరిధిలోని బీసీ కాలనీలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి ఫీవర్‌సర్వే, లార్వా సర్వే చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంటు మలేరియా నివారణ అధికారి జి.వెంకట్‌రెడ్డి, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ఐ.సుబ్బరాయుడు, పొన్నపోలు పి.హెచ్.సి వైద్యాధికారిణి డాక్టర్ రంగలక్ష్మి, సర్పంచ్ లక్ష్మీదేవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అదనపు ఎస్పీగా బాధ్యతలు స్వీకరణ



అడిషనల్ ఎస్పీకి స్వామివారి చిత్రపటాన్ని బహుకరిస్తున్న ఆలయ అధికారులు, అర్చకులు

రాయచోటి టౌన్: అన్నమయ్య జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) గా కె. వెంకటాద్రి బాధ్యతలు చేపట్టారు. శుక్రవారం ఆయన జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడును మర్యాద పూర్వకంగా కలసి తరువాత బాధ్యతలు స్వీకరించారు.

ఎస్ఐగా ప్రారంభించి....

1991వ సంవత్సరంలో మొదటి సారిగా ఎస్ఐగా బాధ్యతలు చేపట్టి 2002వ సంవత్సరంలో సీఐగా పదోన్నతి పొందారు. తరువాత 2013వ సంవత్సరంలో డీఎస్పీగా పదోన్నతి పొందారు. ఆయన ఉమ్మడి కడప జిల్లాలోని పలు చోట్ల ఎస్ఐగా, సీఐగా విధులు నిర్వర్తించారు. డీఎస్పీగా కర్నూలు జిల్లాలో ఎన్ఐఏ (నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ)లో, తిరుపతి మహిళ కళాశాల పరిధిలో ఏసీబీ డీఎస్పీగా, రేణిగుంట డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తూ అదనపు ఎస్పీగా పదోన్నతిపై అన్నమయ్య జిల్లాకు వచ్చారు.

వీరభద్రుడి సన్నిధిలో అడిషనల్ ఎస్పీ

రాయచోటి శ్రీ వీరభద్ర స్వామిని అన్నమయ్య జిల్లా అడిషనల్ ఎస్పీ వెంకటాద్రి శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. స్వామి చిత్రపటాన్ని అందజేశారు.

అదివో.. అల్లదివో..

పద కవితా పితామహుడు అన్నమయ్య. ఆయన కలియుగదైవం వెంకటేశ్వరుడికి చేసిన సంకీర్తనా గానం అమృతమయం. ఆ వాగ్గేయకారుడి కీర్తనలు విశ్వవ్యాప్తం చేయడానికి ఆయన వంశీకులు ఉభయ తెలుగు రాష్ట్రాలలో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు. సంకీర్తన, ఆధ్యాత్మిక, సామాజిక సేవ అంశంగా తీసుకుని ఊరూరా.. అన్నమయ్య.. ఇంటింటా అన్నమయ్య అనే నినాదంతో ముందుకువెళుతున్నారు. పలు ఆలయాలలో సంకీర్తనాగానంతో పాటు చిన్నారులకు కోలాట ప్రదర్శనలో శిక్షణ ఇస్తున్నారు. శుక్రవారం అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాకలో ఇంటింటా అన్నమయ్య కార్యక్రమం భక్తుల కోలాహలం మధ్య ఘనంగా చేపట్టారు.



వైజాగ్‌లో అన్నమయ్య వర్ధంతి ఉత్సవాలలో భాగంగా ఊరూరా అన్నమయ్య..ఇంటింటా అన్నమయ్యలో సంకీర్తన గానం చేస్తున్న కళాకారులు (ఫైల్)



రాజంపేట: పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల సంకీర్తనలు విశ్వవ్యాప్తి చేయడానికి అన్నమయ్య వారసులు నడుంబిగించారు. ఈ నేపథ్యంలో 2005 ఆగస్టు 30న శ్రీ వెంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్‌ను తిరుపతిలో ప్రారంభించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో సంకీర్తనల సేవతో పాటు ఆధ్యాత్మిక, సామాజిక సేవలను కొనసాగిస్తూ వస్తున్నారు. 12వ తరం అన్నమయ్య వారసులు ఏర్పాటుతో ప్రారంభమైన ఆ సేవ ఇప్పుడు 13వ తరం వారసులు కూడా శుక్రవారం చేపట్టిన కార్యక్రమాలతో ముందుకు తీసుకెళుతున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో అన్నమయ్య సేవాసంస్కృతి అన్న నామాలతో ప్రసిద్ధి చెందింది. ఎన్నో కార్యక్రమాలను నిర్వహించారు.

ఊరూరా అన్నమయ్యలో..

ఊరూరా అన్నమయ్య కార్యక్రమంలో భాగంగా ప్రతి ఆలయానికి వెళ్లి అక్కడ సాంస్కృతిక, సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విష్ణుపురాణం, హనుమాన్ చాలీషా, నగర సంకీర్తన తదితర కార్యక్రమాలు చేపడుతున్నారు. అన్నమయ్య పల్లకీసేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

సంకీర్తనలు, కోలాటంలో ఉచితంగా శిక్షణ

అన్నమాచార్య సంకీర్తనలు, కోలాటాలలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. సామాజిక సేవ, ఆధ్యాత్మిక సేవ, అన్న మయ్య సంకీర్తన ప్రచారసేవ, సాంస్కృతి సేవ, భక్తిసేవ, సంగీత సేవ కార్యక్రమాలతో పాటు పాఠశాలలలో విద్యార్థులకు ఉచితంగా అన్నమయ్య సంకీర్తనలు నేర్పిస్తున్నారు. కోలాటంలో కూడా శిక్షణ ఇస్తున్నారు. భక్తి గాన మంజరి కార్యక్రమాలపై పిల్లలలో అవగాహన కోసం స్తోత్ర మంజరి పై కార్యక్రమాలను నిర్వహించి వరల్డ్ రికార్డ్స్ సాధించారు.

ఏటా అన్నమయ్య ఆరాధనోత్సవాలు

ప్రతి ఏటా అన్నమయ్య ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నారు. అలాగే జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. టీటీడీ నిర్వహించే అన్నమయ్య జయంతి, వర్ధంతి కార్యక్రమాలకు అన్నమయ్య 12 వ తరానికి చెందిన హరిస్వామి విధిగా పాల్గొంటున్నారు. ఈ ట్రస్ట్ చైర్మన్‌గా తాళ్లపాక రామ్‌చరణ్, వైస్‌చైర్మన్‌గా తాళ్లపాక కృష్ణధీరజ్, సెక్రటరీగా తాళ్లపాక గౌరీ ప్రసన్న, ఉభయ రాష్ట్రాల డైరక్టర్లుగా కొఠారి సునీత, మీనాక్షి అన్నమయ్య వ్యవహరిస్తున్నారు.

సామాజికసేవలోనూ..

ప్రతి సంవత్సరం మార్చి నుంచి జూన్ వరకు వేసవిలో విశాఖ, కర్నూలు నగరాలలో భక్తులకు దాహం తీర్చేందుకు మంచినీళ్లు, మజ్జిగ వితరణ కేంద్రాలను ఏర్పాటుచేసి అన్నమయ్య సేవను అందిస్తున్నారు. అలాగే పల్స్‌పోలియో, మెడికల్ క్యాంప్, రక్తదాన శిబిరం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం కొనసాగుతోంది.

అన్నమయ్య జన్మస్థలిలో ..

కార్తీక పౌర్ణమి రోజున తాళ్లపాక అన్నమాచార్యుల జన్మస్థలి తాళ్లపాకలో ఊరూర అన్నమయ్య.. ఇంటింటా అన్నమయ్య కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భక్తులను అన్నమయ్య వారసులు కోరుతున్నారు.

ఊరూరా అన్నమయ్యకు విశేష స్పందన



ఊరూరా అన్నమయ్య...ఇంటింటా అన్నమయ్య కార్యక్రమానికి భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఉభయ తెలుగు రాష్ట్రాలలో అన్నమాచార్యుని సంకీర్తనల వ్యాప్తి, శిక్షణ, ఆధ్యాత్మిక సేవ, సామాజిక సేవలను నిర్వహిస్తున్నాం. భక్తి,సేవపరంగా అన్నమయ్య చూపిన మార్గంలో మేము ముందుకెళుతున్నాం.

– మీనాక్షి అన్నమయ్య, డైరక్టరు, తెలంగాణా అన్నమయ్య సేవాసంస్కృతి

అన్నమయ్య సంకీర్తనలకు విస్తృత ప్రచారం



తాళ్లపాక అన్నమాచార్యుల సంకీర్తనలకు విస్తృతప్రచారం నిర్వహిస్తున్నాం. ఊరూర అన్నమయ్య..ఇంటింటా అన్నమయ్య కార్యక్రమాలను ఏపీ, తెలంగాణాలో దిగ్విజయంగా నిర్వహిస్తున్నామంటే భక్తుల సహకారం ఎంతో ఉంది. టీటీడీ సహకారం అన్నమయ్య వారసులకు ఉండటం వల్ల మేము ఆధ్యాత్మికసేవను ముందుకు తీసుకెళుతున్నాం.

– తాళ్లపాక గౌరీ ప్రసన్న, ట్రస్ట్ సెక్రటరీ, తిరుమల

అన్నమాచార్యుల సంకీర్తనలు విశ్వవ్యాప్తం చేస్తాం

- అన్నమయ్య వంశీకుడు తాళ్లపాక హరినారాయణస్వామి



తాళ్లపాకలో మాట్లాడుతున్న అన్నమయ్య వంశీకుడు తాళ్లపాక హరినారాయణచార్యులు

రాజంపేట: తాళ్లపాక అన్నమాచార్యుల సంకీర్తనలను విశ్వవ్యాప్తం చేయడానికే ఊరూరా అన్నమయ్య.. ఇంటింటా అన్నమయ్య కార్యక్రమాన్ని అన్నమయ్య వంశీకుల తరపున నిర్వహిస్తూ వస్తున్నామని అన్నమాచార్య 12వ తరానికి చెందిన వంశీకుడు తాళ్లపాక హరినారాయణస్వామి (తిరుమల) అన్నారు. కార్తిక పౌర్ణమిని పురస్కరించుకొని శుక్రవారం అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాకలో ఊరూరా అన్నమయ్య.. ఇంటింటా అన్నమయ్య కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉభయ తెలుగురాష్ట్రాలలో సంకీర్తనల సేవతో పాటు ఆధ్యాత్మిక, సామాజికసేవలను కొనసాగిస్తూ వస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అన్నమాచార్య సేవా ట్రస్ట్ చైర్మన్ తాళ్లపాక రామ్‌చరణ్, వైస్‌చైర్మన్ తాళ్లపాక కృష్ణధీరజ్, సెక్రటరీ తాళ్లపాక గౌరీ ప్రసన్న, ఉభయరాష్ట్రాల డైరక్టర్లుగా కొఠారి సునీత, మీనాక్షి అన్నమయ్యతో పాటు తాళ్లపాకకు చెందిన జవ్వాది అదృష్ట దీపుడు, శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ సిబ్బంది, అన్నమాచార్య కళాకారులు పాల్గొన్నారు.

108 అడుగుల అన్నమయ్య విగ్రహం వరకు..

ఊరూరా అన్నమయ్య.. ఇంటింటా అన్నమయ్య కార్యక్రమాన్ని తాళ్లపాక గ్రామ శివార్లలోని శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ నుంచి హైవేలోని 108 అడుగుల అన్నమయ్య విగ్రహం వరకు వైభవోపేతంగా నిర్వహించారు. దారిపొడవునా మహిళల కోలాట ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. అన్నమయ్య సంకీర్తనలు మారుమోగాయి.

రాయచోటిలోని శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో పూజలలో పాల్గొన్న భక్తులు



లక్కిరెడ్డిపల్లెలోని శివాలయంలో జ్వాలా తోరణం



కార్తికం.. జ్యోతిర్మయం

రాయచోటి: కార్తిక పౌర్ణమి వేళ ఆలయాలన్నీ నూతన శోభ సంతరించుకున్నాయి. శుక్రవారం తెల్లవారుజాము నుంచి భక్తులు ప్రత్యేక స్నానాలు, పూజలతో శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఉన్న శైవక్షేత్రాలతో పాటు అన్ని ఆలయాలు భక్తుల దీపారాధనలు, పూజలతో కిక్కిరిసాయి. ఆయా ప్రాంతాలలో ఉన్న ఆలయాల్లో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు చేశారు. నదులు, కోనేరులు, నీటి ప్రవాహాలలో భక్తులు కార్తిక దీపాలు వదిలి ప్రత్యేక పూజలు చేశారు.

- రాయచోటిలోని శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయం, పాతరాయచోటిలోని అగస్త్యేశ్వరాలయం, ఎస్ఎన్ కాలనీలోని ఉమామహేశ్వర ఆలయాలలో మహిళా భక్తులు ప్రత్యేక దీపారాధన చేశారు. రాజంపేట నియోజకవర్గ పరిధిలోని అత్తిరాలలో ఉన్న శ్రీ కామాక్షి సమేత త్రేతేశ్వరస్వామి ఆలయం అన్నమయ్య, వైఎస్ఆర్ జిల్లాల నుంచి తరలివచ్చిన భక్తులతో నిండిపోయింది. భక్తులు గిరి ప్రదక్షిణ చేశారు. గుండ్లూరులోని అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తంబళ్లపల్లె నియోజకవర్గం మల్లయ్య కొండపై వెలసిన భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో మల్లయ్య స్వామి వేషధారణలతో వచ్చిన భక్తులు ఆకట్టుకున్నారు. అంగళ్లులోని మల్లయ్య కొండ ఆలయం దీపాల వెలుగుతో కనువిందు చేసింది. మదనపల్లి నియోజకవర్గంలోని తవళం నేల మల్లేశ్వరస్వామి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. మదనపల్లి పట్టణంలోని మణికయ్యల శివాలయం, కోడూరు పరిధిలోని భ్రమరాంబిక మల్లేశ్వర స్వామి ఆలయం, గుండాల కోన శివాలయం, పీలేరులోని శ్రీ కాశీ విశ్వేశ్వరాలయం లాంటి ప్రధాన ఆలయాలతో పాటు మండల గ్రామీణ ప్రాంతాలలో వెలసిన శివాలయాలలో కార్తిక శోభ కన్నులపండుగగా విరాజిల్లింది. ఈ ఆలయాలలో భక్తులు కార్తిక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.



అత్తిరాలలో ప్రత్యేక అలంకరణలో కామాక్షీ దేవీ, త్రేతేశ్వరస్వామి

రైతు నెత్తిన బీమా భారం!

- రైతుల తరపున రూ.9.87 కోట్లు చెల్లించిన గత ప్రభుత్వం
- గత ఏడాది అందిన పంటల బీమా. పంట నష్ట పరిహారం
- నేడు అన్నదాతలపైనే భారం మోపిన ప్రభుత్వం
- లబోదిబోమంటున్న రైతులు



గుర్రంకొండలో ఈ క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయాధికారులు

గుర్రంకొండ: కూటమి ప్రభుత్వం రైతు నెత్తిన బీమా భారం మోపింది. ప్రస్తుత రబీ సీజన్‌లో రైతులు సాగు చేసుకొంటున్న పంటలకు పంటల బీమా ప్రీమియం మొత్తాన్ని రైతులే చెల్లించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వం 2023 రబీ సీజన్‌లో రైతుల తరపున పంటల బీమా ప్రీమియం మొత్తం రూ. 9.87 కోట్లను చెల్లించింది. ఏ రైతు ఒక్క రూపాయి కూడా బీమా ప్రీమియం మొత్తాన్ని చెల్లించలేదు.

అన్నదాతలకు అండగా గత ప్రభుత్వం:


జిల్లా వ్యాప్తంగా 2023లో అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుల తరపున పంటల బీమా మొత్తం రూ. 9,87,14,620 చెల్లించింది. రబీలో సాగు చేసిన పంటలను ఆర్బీకే సిబ్బంది ఈ క్రాప్ నమోదు చేయించారు. ఈక్రాప్‌లో నమోదు చేసుకొన్న ప్రతి ఎకరం పంటకు పంటల బీమా ప్రీమియం గత ప్రభుత్వమే చెల్లించింది. గత ఏడాది జిల్లాలో 70,291 మంది రైతులు టమాటా, వరి, వేరుశెనగ, అరటి, బొప్పాయి, పసుపు, కూరగాయలు, పూలతోటలను 1,13,074 ఎకరాల్లో సాగు చేశారు. వీటికి ఈక్రాప్ నమోదు చేశారు. వీటికి బీమా ప్రీమియం మొత్తం అప్పటి ప్రభుత్వం చెల్లించింది. గత ప్రభుత్వ హయాంలో ఖరీఫ్ అయినా, రబీ అయినా రైతులు ఒక్క రూపాయి కూడా పంటల బీమా ప్రీమియం చెల్లించలేదు. రైతుల తరపున ప్రభుత్వమే ఆ భారం మొత్తం మోసింది.

రైతులకు భారంగా పంటల బీమా ప్రీమియం

ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఆర్బీకే సిబ్బంది, వ్యవసాయాధికారులు రబీ సీజన్‌కు సంబంధించి రైతులు సాగు చేసిన పంటలకు ఈక్రాప్ నమోదు చేస్తున్నారు. ఈ క్రాప్ నమోదు చేయించుకొన్న రైతుకు పంటల బీమా ప్రీమియం మొత్తాన్ని మీరే భరించాలని చెబుతున్నారు. ఒక వేళ రైతులు బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకొని ఉంటే సదరు ప్రీమియం మొత్తం పంట రుణం బాకి నుంచి బ్యాంకు వారే చెల్లిస్తారు. జిల్లాలో ముఖ్యంగా పడమటి మండలాల్లో టమాటా పంట ఎక్కువగా రబీసీజన్‌లో సాగు చేస్తుంటారు. ఎకరం పంటకు బీమా చేయించాలంటే రైతు రూ. 1600 వరకు చెల్లించాల్సి ఉంటుంది. దీంతో టమాటా రైతులపై భారం పడుతోంది.

గతంలో అందిన పంటల బీమా, పంట నష్ట పరిహారం:

గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్లు రైతులు ఒక్క రూపాయి బీమా ప్రీమియం చెల్లించక పోయినప్పటికీ పంటల బీమా, పంట నష్టపరిహారం వంటి సాయం పొందారు. జిల్లాలో రైతులు ఈక్రాప్ నమోదు చేసుకొన్నారంటే వారు తప్పనిసరిగా పంటల బీమా, పంట నష్ట పరిహారం పొందడానికి అర్హులని అర్థం. వాతావరణ పరిస్థితులు, వరదలు, తుఫాన్ల కారణంగా పంటలు నష్టపోయిన రైతులందరికీ గతంలో ప్రభుత్వం చెల్లించిన పంటల బీమా ఆధారంగా నష్ట పరిహారం అందింది.



2023 రబీ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా ఈక్రాప్ చేసిన పంటలు, సాగు చేసిన రైతులు, గత ప్రభుత్వం చెల్లించిన పంటల బీమా మొత్తంవివరాలు


ఈ ఏడాది రైతులు సాగు చేసిన పంటలకు ప్రభుత్వం నిర్ణయించిన బీమా ప్రీమియం మొత్తం

పంట రకం	బీమా ప్రీమియం మొత్తం (ఎకరాకు)
టమాటా	రూ.1600
వరి	రూ.96
వేరుశెనగ	రూ. 126

డిసెంబర్15 వరకు గడువు

బీమా ప్రీమియం చెల్లించడానికి ప్రభుత్వం డిసెంబర్ 15 వరకు గడువు విధించింది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే ఈ క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తి అయ్యింది. ఈక్రాప్ చేయించుకొన్న రైతులు టమాటా పంటకు ఎకరానికి రూ.1600, వరి పంటకు రూ. 96, వేరుశెనగ పంటకు రూ. 126 బీమా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. ఈక్రాప్ నమోదు ముగిసినా బీమా చేయించుకోవడానికి మాత్రం ప్రభుత్వం నెలరోజుల వరకు గడువు ఇచ్చింది. దీంతో ఆర్బీకే సిబ్బంది పంటల బీమాపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.


గతంలో ప్రీమియం చెల్లించలేదు



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలనలో మేము ఎన్నడూ పంటల బీమా ప్రీమియం మొత్తాన్ని చెల్లించలేదు. మాగ్రామంలో ఆర్బీకే సిబ్బంది మాపొలం వద్దకు వచ్చి ఈక్రాప్ నమోదు చేసుకొని వెళ్లేవారు. ఆ తరువాత ఎటువంటి డబ్బులు మా నుంచి వసూలు చేయలేదు. కానీ పంట నష్ట పరిహారం ప్రభుత్వం నుంచి మాకు అందింది.

– లక్ష్మీదేవి, రైతు, కొత్తపల్లె

బ్యాంకుల చుట్టూ తిరగలేం



నేను టమాటా పంట రెండెకరాల్లో సాగు చేశాను. కొద్దిరోజుల కిందట ఆర్బీకే సిబ్బంది వచ్చి టమాటా పంటను ఈక్రాప్ నమోదు చేసుకొని వెళ్లారు. పంటల బీమా ప్రీమియం మొత్తాన్ని మీరే చెల్లించాలని వారు చెప్పారు. వాతావరణ పరిస్థితులు కారణంగా పంటలు దెబ్బతింటే పంట నష్టపరిహారం వస్తుందని చెప్పారు. నేను బ్యాంకులో పంట రుణం తీసుకొన్నాను. నేను పంటల బీమా ప్రీమియం చెల్లించాలంటే బ్యాంకుల వద్దకు వెళ్లాలని చెప్పారు. ఇక బ్యాంకుల చుట్టూ తిరగడం ఎలాగో అర్థం కావడం లేదు.

– నారాయణ, రైతు, మొరంపల్లె

క్లుప్తంగా

కారుడ్రైవరు అనుమానాస్పద మృతి


మృతుడు మధుబాబు

రాజంపేట : పట్టణంలోని ఏబీ చంద్రారెడ్డి కల్యాణ మండపం సమీపంలో నివాసం ఉంటున్న కారు డ్రైవరు కె. మధుబాబు (31) బాత్రూంలో అనుమానాస్పద స్థితిలో గురువారం మృతిచెందాడు. భార్య స్వర్ణలత మధ్యాహ్నం 3గంటల సమయంలో భర్త మృతిచెందినట్లు మామ శ్రీనివాసులకు సమాచారం అందించింది. అయితే తమ కుమారుడు ఆత్మహత్య చేసుకునే అంత పిరికివాడుకాదని తల్లి రోదించింది. కుమారుడి శరీరంపై గాయాలు ఉండటంతో అనుమానం వ్యక్తం చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. శుక్రవారం అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు.

కుక్కల దాడిలో కృష్ణజింకకు తీవ్రగాయాలు


కుక్కల దాడిలో గాయపడిన కృష్ణజింక

ములకలచెరువు : కుక్కల దాడిలో కృష్ణజింకకు తీవ్రగాయాలైన సంఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు... స్థానిక మండల కేంద్రం టీటీడీ కళ్యాణ మండపం వద్ద కుక్కలు జింకను చుట్టుముట్టాయి. అటువైపు టమాట మార్కెట్‌కు వెళ్తున్న కూలీలు గమనించి కుక్కల దాడి నుంచి జింకను కాపాడారు. సమాచారం అందుకున్న పోలీసులు వెటర్నరీ హాస్పిటల్‌లో చికిత్స అందించి ఫారెస్టు అధికారులకు జింకను అప్పగించారు. కనుగొండ అడవిలో జింకను వదిలిపెట్టినట్లు ఫారెస్టు బీటు అధికారి షబీన్ వెల్లడించారు.

భర్త వేధింపులపై కేసు

మదనపల్లె : భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. మండలంలోని బసినికొండ గ్రామం శివాలయం వీధిలో దంపతులు షేక్ గౌస్‌బాషా, షేక్ నదియా(23) నివాసమున్నారు. గౌస్ బాషా గత రెండు సంవత్సరాలుగా చెడు వ్యసనాలకు బానిసై, ప్రతి రోజు మద్యం సేవించి భార్య నదియాను వేధించేవాడు. అతని వేధింపులను భరిస్తూ మానసికంగా వేదనకు గురవుతున్న నదియా భర్తవేధింపులకు తాళలేక శుక్రవారం తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సమస్యలతో వివాహిత ఆత్మహత్యాయత్నంకు పాల్పడిన సంఘటన శుక్రవారం బి.కొత్తకోట మండలంలో జరిగింది. పోకనాటివారిపల్లెకు చెందిన శేఖర్‌రెడ్డి భార్య అరుణ (31) కుటుంబ సమస్యల కారణంగా మనస్తాపం చెందిన పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే బాధితురాలిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

లారీకింద బయట పడిన మృతదేహం

వల్లూరు(చింతకొమ్మదిన్నె) : రాయచోటి-కడప మార్గంలోని గువ్వల చెరువు ఘాట్‌లో బోల్తా పడిన లారీ కింద మృత దేహం లభ్యమైంది. గురువారం తెల్లవారు జామున బ్యాటరీ లోడుతో రాయచోటి వైపు నుంచి కడప వైపునకు వస్తున్న లారీ అదుపుతప్పి బోల్తా పడింది. అయితే ఈ ఘటనలో సురక్షితంగా బయటపడిన వ్యక్తి తాను క్లీనర్‌నని చెప్పాడు. మరో వ్యక్తి లారీలో ఉన్నట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. శుక్రవారం బ్యాటరీలన్నీ తొలగించి లారీని బయటకు తీయగా లారీ కింద మృతదేహం లభ్యం అయింది. ఇతను యూపీకి చెందిన అతుల్ కుమార్ తివారీగా ఆధార్ కార్డును చూసి గుర్తించారు. లారీ ఎక్కడి నుంచి ఎక్కడి పోతుంది.. తదితర వివరాలన్నీ పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

ఆదివాసీల ఆరాధ్యుడు బీర్సా ముండా

జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శరాజేంద్రన్


మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శరాజేంద్రన్

రాయచోటి (జగదాంబసెంటర్) : ఆదివాసీల ఆరాధ్యుడు, హక్కుల కోసం పోరాడిన మహనీయుడు బీర్సా ముండా అని జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ కొనియాడారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో తొలి విప్లవవీరుడైన బీర్సా ముండా జయంతిని పురస్కరించుకుని జన జాతీయ గౌరవ దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి మరియు బాబా సాహెబ్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన బీర్సా ముండా జయంతి నవంబర్ 15ను జన జాతీయ గౌరవ దివస్‌గా జరుపుకోవడం, వారిని స్మరించుకోవడం ఆనందదాయకమన్నారు. ఆదివాసీల్లో విప్లవ భావాలను రగిలించిన తొలి వీరుడు బీర్సా ముండా అని కొనియాడారు. ప్రజలు ఎన్నుకున్న రాజ్యాన్ని స్థాపిద్దాం అనే నినాదాలతో ఆదివాసీలను తిరుగుబాటు వైపు నడిపించాలన్నారు. జార్ఖండ్ ప్రాంతంలో జన్మించిన ఈయనను ముండా తెగకు చెందిన ప్రజలు దేవునిగా భావించి 'భగవాన్' అని పిలిచేవారని, ఆదివాసీల సాగుభూములపై విధిస్తున్న పన్నులకు వ్యతిరేకంగా బ్రిటీష్ వారిపై పోరాడి అమరుడయ్యారని పేర్కొన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని సంతల్ తదితర తెగల వారు తమ హక్కులను సాధించుకున్నారని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీల సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలను, పథకాలను రూపొందించిందని, వీటిని ఆదివాసీ ప్రజలు, విద్యార్థులు ఉపయోగించుకుని మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఇంచార్జ్ అధికారి సందప్ప మాట్లాడుతూ బిర్సా ముండా జయంతిని జన జాతీయ గౌరవ దివస్‌గా భారత కేంద్ర ప్రభుత్వం గుర్తించిందని, ఈ గుర్తింపు ఆదివాసీలందరూ గర్వించదగ్గ విషయం అన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న వివిధ కార్యక్రమాలు మరియు పథకాలను ఆదివాసీ విద్యార్థినీ విద్యార్థులు ఉపయోగించుకొని మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. సమావేశంలో డీఆర్ఓ మధుసూధన్‌రావు, గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జ్ అధికారి సందప్ప, రైల్వేకోడూరు జడ్పీటీసీ రత్నమ్మ, జిల్లాలోని గిరిజన సంక్షేమ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక క్వారీ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయండి


గొల్లపల్లి ఇసుక క్వారీ వద్ద కాంట్రాక్టర్‌తో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ అతిథి సింగ్

ఒంటిమిట్ట : మండల పరిధిలోని గొల్లపల్లి ఇసుక క్వారీ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కడప జిల్లా జాయింట్ కలెక్టర్ అతిథి సింగ్ ఆదేశించారు. శుక్రవారం మండల పరిధిలోని గొల్లపల్లి ఇసుక క్వారీని ఆమె పరిశీలించి మండల రెవెన్యూ అధికారులు, ఇసుక క్వారీ కాంట్రాక్టరు, గ్రామస్తులతో ఇసుక రవాణాకు ఎదురవుతున్న సమస్యలపై చర్చించారు.అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉచిత ఇసుక రవాణాకు పెట్టిన నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. అలాగే ఇసుక క్వారీలో ఎలాంటి అక్రమాలు జరగకుండా ఎప్పటికప్పుడు అధికారులకు తెలిసేలా సీసీ కెమెరాలు అమర్చాలని ఆదేశించారు. జేసీ వెంట గనులశాఖ కడప జిల్లా డిప్యూటీ డైరెక్టర్ సూర్య, ఒంటిమిట్ట తహసీల్దార్ రమణమ్మ, మండల రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

అత్తారింట్లో అల్లుడి దోపిడీ

- ఇంటి ముఖద్వారం పగులగొట్టి చొరబాటు
- బంగారు, నగదు, విలువైన పత్రాలు దోపిడీ

గాలివీడు : మండల పరిధిలోని దాసంరెడ్డిగారిపల్లెకు చెందిన సింగం రమణారెడ్డి, పద్మావతమ్మల ఇంటిపై శుక్రవారం అల్లుడు టి. జ్యోతిరెడ్డి దౌర్జన్యం చేసిన సంఘటన చోటు చేసుకొంది. బాధితుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అల్లుడు టి. జ్యోతిరెడ్డి, అదే గ్రామానికి చెందిన టి. యోగాంజనేయుల రెడ్డి, టి. సుధాకర్‌రెడ్డిలు కలసి రమణారెడ్డి ఇంటిలో ఎవరూ లేనిసమయంలో ఇంటి ముఖద్వారం పగలకొట్టి చొరబడ్డారు. బీరువాలో నగదు రూ.2,30,000లు, ఐదు తులాల బంగారు ఆభరణాలు, విలువైన పత్రాలు ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ప్రేమ వివాహమే దోపిడీకి కారణమా ..

దాసంరెడ్డిగారిపల్లెకు చెందిన బసిరెడ్డి కుమారుడు జ్యోతి రెడ్డి అదే గ్రామానికి చెందిన రమణారెడ్డి కుమార్తె లావణ్యను వారం రోజుల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరి వివాహాన్ని అమ్మాయి తల్లిదండ్రులు వ్యతిరేకించారు. అంతే కాకుండా కూతురికి ఇవ్వాల్సిన లాంఛనాలు ఏమీ ఇవ్వలేదు. ఆపై ఆమెకు మాకు ఎలాంటి సంబధం లేదని తెగేసి చెప్పడంతో కోపం పెంచుకున్నాడు. దీంతో జ్యోతిరెడ్డి మామాగారి ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి అన్నవరుసైన యోగాంజనేయుల రెడ్డి, సుధాకర్‌రెడ్డి సాయంతో ఈ ఘటనకు పాల్పడ్డారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు


గాయపడిన వెంకటరమణగౌడ, సిద్దమల్లు

మదనపల్లె : ద్విచక్రవాహనానికి గొర్రెలు అడ్డురావడంతో వాహనం అదుపుతప్పి పడి ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం మదనపల్లె మండలంలో జరిగింది. బురకాయలకోట పంచాయతీ బోయవానిపల్లెకు చెందిన సిద్దమల్లు (60) వేపూరికోటకు చెందిన వెంకటరమణగౌడ (62) ఇద్దరు కలిసి ద్విచక్రవాహనంలో దేవులచెరువు నుంచి వేపూరికోటకు వెళుతుండగా మార్గమధ్యంలోని పర్తికోట వద్ద గొర్రెల మంద అడ్డురావడంతో ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడ్డారు. ప్రమాదంలో సిద్దమల్లుకు కాలు,చెయ్యి విరగగా, వెంకటరమణగౌడకు ముఖం, తలపై గాయాలతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితులను 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం వెంకటరమణగౌడ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

గ్రామ సమస్యలపై దృష్టి సారించండి


సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ బాలకృష్ణారెడ్డి

లక్కిరెడ్డిపల్లి : గ్రామ సమస్యలపై దృష్టి సారించాలని డీపీఓ బాలకృష్ణారెడ్డి పేర్కొన్నారు. గిరిజన నాయకులు బిరసాముండి జయంతి సందర్భంగా స్థానిక ఎంపీడీఓ భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాలలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించేలా చొరవచూపాలన్నారు. గ్రామాలలో పెండింగ్‌లో ఉన్న మరుగుదొడ్ల పనులను వేగవంతం చేయాలన్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా తాగునీటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రెడ్డన్న, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం


శ్రీనివాసులు (ఫైల్)

ఒంటిమిట్ట : మండల పరిధిలోని మరుకొండ మల్లేశ్వరస్వామి ఆలయం ఎదురుగా శుక్రవారం రైలు ఢీ కొట్టడంతో పుత్తా శ్రీనివాసులు (56) దుర్మరణం చెందాడు. రైల్వే పోలీసుల వివరాల మేరకు.. శుక్రవారం కార్తీక పౌర్ణమి కావడంతో వేకువజామున 5 గంటల నుంచి 6 గంటల సమయంలో మృకుంద మల్లేశ్వరస్వామి ఆలయానికి వస్తున్నారు. రైలు పట్టాలను దాటేందుకు భక్తులు కొంతమంది ప్రయత్నిస్తుండగా వారిని వద్దని వారిస్తూ కుడిచేతితో సైగలు చేస్తున్నాడు. ఆ సమయంలో ఆయన చేయి రైలును తాకడంతో రైలు వేగానికి శ్రీనివాసులను కూడా ఈడ్చుకెళ్లడంతో దూరంగా ఎగిరిపడ్డాడు. ప్రమాదంలో ఆయన మృతి చెందాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

రైలు కింద పడి విద్యార్థినికి తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడిన యువతి

రైల్వేకోడూరు అర్బన్ : అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గంలోని శెట్టిగుంట సమీపంలో రైలు కింద పడి విద్యార్థినికి తీవ్ర గాయాలయ్యాయి. బద్వేలు మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన బిజివేముల జయరామిరెడ్డి, ఆదిలక్షుమ్మ దంపతులకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు. కాగా రెండవ కుమార్తె బిజివేముల రామసుధ (20) తిరుపతిలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బి.టెక్ మూడవ సంవత్సరం చదువుతోంది. తిరుపతి నుంచి స్వగ్రామానికి వచ్చేందుకు రైలులో వస్తున్న రామసుధ శెట్టిగుంట సమీపంలో రైలు కింద పడి గాయాలపాలైనట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. రైల్వేకోడూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న రామసుధ పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది. అయితే రామసుధ ప్రమాదవశాత్తు రైలు నుండి కింద పడిందా లేక మరేదైనా కారణం ఉందా అన్న విషయం తెలియాల్సి ఉంది.

వాటర్ ట్యాంక్‌లో విషం కలిపిన వ్యక్తిపై కేసు

చాపాడు : మండల పరిధిలోని ఎస్.ఓబాయపల్లె గ్రామానికి చెందిన అయ్యావారురెడ్డి అనే వ్యక్తిపై వాటర్ ట్యాంక్‌లో విషం కలిపాడని శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపారు. గ్రామానికి చెందిన నందిమండలం శంకర్‌రెడ్డి ఇంటిపై నుంచి గురువారం అర్ధరాత్రి ఇదే గ్రామానికి చెందిన అయ్యావారురెడ్డి కిందకు దిగి పోవడాన్ని గుర్తించారు. దీంతో మిద్దె పైకి వెళ్లి చూడగా వాటర్ ట్యాంక్ తెరచి ఉండటంతో అందులో పరిశీలించగా విషం కలిపినట్లు గుర్తించారు. బాధితుడు శంకర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు అయ్యావారురెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

భార్యను కత్తితో పొడిచిన భర్త


కత్తిపోటుతో గాయపడిన సుబ్బలక్షుమ్మ

కాశినాయన : మండలంలోని బాలరాజుపల్లె గ్రామానికి చెందిన బసిరెడ్డిరామిరెడ్డి తన భార్య సుబ్బలక్షుమ్మను శుక్రవారం కత్తితో పొడిచి తీవ్రంగా గాయపరిచాడు. పోలీసులు, వారి బంధువులు తెలిపిన వివరాల మేరకు.. మద్యానికి బానిసైన రామిరెడ్డి ప్రతినిత్యం భార్యతో గొడవ పడుతుండేవాడు. ఈ తరుణంలోనే మద్యానికి డబ్బులు ఇవ్వాలని భార్యతో గొడవపడి డబ్బులు ఇవ్వలేదని కత్తితో తీవ్రంగా గాయపరిచాడు. ఎస్ఐ హనుమంతు సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఆమెను వెంటనే పోరుమామిళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళపై బంధువుల దాడి

మదనపల్లె : మహిళపై ఆమె భర్త బంధువులు దాడి చేసి గాయపరిచిన సంఘటన శుక్రవారం సాయంత్రం మదనపల్లె మండలంలో జరిగింది. బాధితురాలి కథనం మేరకు... మదనపల్లె మండలం సిటీఎం పంచాయతీ మిట్టపల్లెకు చెందిన రాజశేఖరరెడ్డి భార్య స్వప్నప్రియ(30) ఇటీవల ఆడపిల్ల పుట్టింది. మగబిడ్డ పుట్టలేదన్న కారణంతో కుటుంబసభ్యులు ఆమెపై వ్యతిరేకత వ్యక్తం చేస్తూ వచ్చారు. వేధింపులకు సైతం గురి చేశారు. దీంతో తాలూకా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా భర్త అత్త,మామలకు పోలీసులకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు. అయినా వారిలో మార్పు రాలేదు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం పాడిఆవులను మేత నుంచి ఇంటికి తీసుకువచ్చింది. అనంతరం తాగునీటి కోసం కుళాయి వద్దకు వెళ్లగా, అక్కడ రాజశేఖరరెడ్డి బంధువులైన అశ్విని, ఆదినారాయణ,మమత,రమేష్‌రెడ్డి, రమణమ్మలు స్వప్నప్రియతో ఉద్దేశపూర్వకంగా, ఆమె కుటుంబసభ్యుల ప్రోత్సాహంతో గొడవకు దిగారు. వారి మధ్య వాగ్వావాదం జరుగుండగానే స్వప్నప్రియపై దాడి చేసి విచక్షణరహితంగా కొట్టారు. గొడవలో స్వప్నప్రియ తలకు గాయమైంది. స్థానికుల సహాయంతో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సలు పొందుతోంది. దాడి ఘటనపై తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేసింది.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


ఆశీర్వాదం(ఫైల్)

వేంపల్లె : వేంపల్లెలోని క్రిస్టియన్ కాలనీకి చెందిన గూడూరు ఆశీర్వాదం(58)అనే రైతు అప్పుల బాధతో గుళికల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ రంగారావు తెలిపారు. శుక్రవారం మృతుడి భార్య జయమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. వివరాలిలాన్నాయి.. ఆశీర్వాదం గత 20 సంవత్సరాలుగా వ్యవసాయం చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. అప్పులు చేసి పంటలు సాగుచేసినా పెట్టుబడుల మేర కూడా దిగుబడి రాకపోవడంతో ప్రతి యేడాది నష్టాలు చవిచూస్తున్నాడు. దీంతో సుమారు రు.3లక్షల మేర అప్పులు చేశాడన్నారు. వాటిని తీర్చలేక జీవితంపై విరక్తి చెంది పొలం వద్ద గుళికల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు భార్య చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లోకేష్‌పై 420 కేసు ఎందుకు పెట్టకూడదు?

మాజీ ఎమ్మెల్యే కొరముట్ల



రైల్వేకోడూరు అర్బన్ : ప్రజలు ప్రశ్నిస్తే కేసులు పెడుతూ అరెస్టులు చేస్తామంటూ చెబుతున్న లోకేష్‌పై 420 కేసు ఎందుకు పెట్టకూడదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు శుక్రవారం ప్రశ్నించారు. యువగళం కార్యక్రమం సందర్భంగా 20 లక్షల మందికి ఉపాధి, నిరుద్యోగులకు రూ.3 వేలు, 50 సంవత్సరాలు పైబడిన వారికి రూ. 4 వేలు పెన్షన్, అన్నదాతకు రూ. 20 వేలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అంటూ అబద్ధాలు చెప్పి హామీలు అమలు చేయని కూటమి నాయకుడు లోకేష్‌పై ఎందుకు 420 కేసు పెట్టకూడదో చెప్పాలన్నారు. అంతేకాకుండా సోషల్ మీడియా కార్యకర్తలపై కేసులు పెట్టడం సిగ్గు చేటన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, సోషల్ మీడియా యాక్టివిస్టులు లోకేష్‌ను నిలదీస్తూ కచ్చితంగా పోస్టులు పెడతారని ఆయన అన్నారు.

జాతీయ త్రోబాల్ జట్టుకు ఎంపిక


త్రోబాల్‌లో ప్రతిభ చూపిన పురుషోత్తం, హరీష్‌ను అభినందిస్తున్న కళాశాల యజమాన్యం

మదనపల్లె సిటీ : చెన్నైలో నిర్వహించనున్న అంతర్జాతీయ త్రోబాల్ టోర్నమెంటుకు స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కాలేజీ విద్యార్థి పురుషోత్తం ఎంపికైనట్లు కాలేజీ కరస్పాండెంట్ రాటకొండ గురుప్రసాద్ తెలిపారు. ఈనెల 27న చెన్నైలో నిర్వహించే అంతర్జాతీయస్థాయి త్రోబాల్ టోర్నమెంటులో పురుషోత్తం పాల్గొంటారన్నారు. 12 మంది జట్టులో పురుషోత్తం ఒకరన్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బిజినూర్‌లో విక్రమ్ యూనివర్సిటీ 47వ సీనియర్ నేషనల్ త్రోబాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున తమ కాలేజీకి చెందిన పురుషోత్తం, హరీష్ పాల్గొన్నారన్నారు. మూడవస్థానానికి జరిగిన పోటీల్లో తెలంగాణ రాష్ట్ర జట్టుతో ఆంధ్ర రాష్ట్ర జట్టు గెలుపొంది తృతీయ స్థానం దక్కించుకున్నట్లు తెలిపారు. వీరిని శుక్రవారం కాలేజీలో ప్రిన్సిపాల్ రమాదేవి, పీడీలు శరత్‌కుమార్, జగదీష్ అభినందించారు.

పోగొట్టుకున్న రామభక్తుడి వస్తువు అప్పగింత

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామిని దర్శించుకునేందుకు నిత్యం వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఇందులో భాగంగా గురువారం సాయంత్రం తెలంగాణ రాష్ట్రానికి చెందిన కార్తీక్ అనే రామ భక్తుడి ఒంటిమిట్ట రామయ్యను దర్శించుకునేందుకు వచ్చారు. రామయ్య దర్శనార్థం ఆలయ ప్రధాన గోపురం వద్ద నుంచి లోనికి వెళ్తుండగా కార్తీక్ చేతిలో నుంచి బంగారు వస్తువు అయిన బ్రాస్లెట్ కనిపించకుండా పోయింది. దీంతో బాధితులు కంగారుపడి ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి క్షేత్రానికి రాక ముందు దేవుని కడప శ్రీ వెంకటేశ్వరస్వామిని దర్శించుకొని ఇక్కడికి వచ్చాడు. దీంతో తిరిగి దేవుని కడప వెంకటేశ్వరస్వామి ఆలయానికి చేరుకొని అక్కడ సీసీ కెమెరాలను పరిశీలించారు. అక్కడ నుంచి ఒంటిమిట్టకు వచ్చేటప్పుడు కారు ఎక్కుతుండగా తన చేతికి బ్రాస్లెట్ ఉండటం గమనించారు. దీంతో బ్రాస్లెట్ ఒంటిమిట్టలోనే పోయి ఉంటుందని తిరిగి ఇక్కడికి రాగా ఒంటిమిట్ట విజిలెన్సు అధికారులు సీసీ కెమెరాలు పరిశీలించారు. ఎలాంటి ఆధారాలు లభించలేదు. ఆలయ విజిలెన్సు సిబ్బందికి ఫోన్ నెంబర్ ఇచ్చి వెళ్లారు. ఒంటిమిట్ట వద్ద భిక్షాటన చేస్తున్న కొంతమంది చేతికి బ్రాస్‌లైట్ దొరికింది. దానిని పెద్దకొత్తపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఓ వ్యక్తికి అమ్మేశారని తెలిసింది. విజిలెన్సు అధికారులు, ఒంటిమిట్ట ఎస్ఐ శివప్రసాద్ విచారించి బ్రాస్లెట్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని బాధితుడికి ఫోన్ ద్వారా తెలపడంతో వారు వచ్చి బ్రాస్లెట్ తీసుకున్నట్లు విజిలెన్సు అధికారి గంగులయ్య తెలిపారు.

ఉపముఖ్యమంత్రి ఆదేశాల మేరకు విచారణ


పార్యంపల్లెలో వివాదాస్పద పొలాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాస్

గుర్రంకొండ : ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టిన సంఘటన మండలంలోని నడిమికండ్రిగ పంచాయతీ ప్యారంపల్లెలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన తమ పొలాన్ని కొంతమంది ఆక్రమించుకొన్నారని ఆరోపిస్తూ ఓ సైనికుడు ఇటీవల ఉపముఖ్యమంత్రిని కలిసి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదును పరిశీలించిన ఉపముఖమంత్రి సమస్యను పరిష్కరించాల్సిందిగా రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈనేపథ్యంలో రాయచోటి ఆర్డీఓ ఎ.శ్రీనివాస్ శుక్రవారం పార్యంపల్లెలో పర్యటించారు. ఫిర్యాదులో పేర్కొన్న మేరకు ఆరోపణలున్న ఆక్రమిత పొలాలను పరిశీలించారు. అప్పటికే పెద్ద ఎత్తున అక్కడికి చేరుకొన్న రైతులు తమ సమస్యను ఆర్డీఓ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం నడిమికండ్రిగ సచివాలయంలో రైతులతో ఆర్డీవో సమావేశం నిర్వహించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇరు వర్గాల వారి పొలాలకు సంబంధించి భూరికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, విఆర్వో సంజీవ, వీఆర్ఏ సురేష్, రైతులు పాల్గొన్నారు.

మహిళపై బంధువుల దాడి

మదనపల్లె : మహిళపై ఆమె భర్త బంధువులు దాడి చేసి గాయపరిచిన సంఘటన శుక్రవారం సాయంత్రం మదనపల్లె మండలంలో జరిగింది. బాధితురాలి కథనం మేరకు... మదనపల్లె మండలం సిటీఎం పంచాయతీ మిట్టపల్లెకు చెందిన రాజశేఖరరెడ్డి భార్య స్వప్నప్రియ(30) ఇటీవల ఆడపిల్ల పుట్టింది. మగబిడ్డ పుట్టలేదన్న కారణంతో కుటుంబసభ్యులు ఆమెపై వ్యతిరేకత వ్యక్తం చేస్తూ వచ్చారు. వేధింపులకు సైతం గురి చేశారు. దీంతో తాలూకా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా భర్త అత్త,మామలకు పోలీసులకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు. అయినా వారిలో మార్పు రాలేదు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం పాడిఆవులను మేత నుంచి ఇంటికి తీసుకువచ్చింది. అనంతరం తాగునీటి కోసం కుళాయి వద్దకు వెళ్లగా, అక్కడ రాజశేఖరరెడ్డి బంధువులైన అశ్విని, ఆదినారాయణ,మమత,రమేష్‌రెడ్డి, రమణమ్మలు స్వప్నప్రియతో ఉద్దేశపూర్వకంగా, ఆమె కుటుంబసభ్యుల ప్రోత్సాహంతో గొడవకు దిగారు. వారి మధ్య వాగ్వావాదం జరుగుండగానే స్వప్నప్రియపై దాడి చేసి విచక్షణరహితంగా కొట్టారు. గొడవలో స్వప్నప్రియ తలకు గాయమైంది. స్థానికుల సహాయంతో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సలు పొందుతోంది. దాడి ఘటనపై తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేసింది.

కనుల పండువగా రామయ్య కల్యాణం


సీతారాముల ఉత్సవ మూర్తులు


కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

ఒంటిమిట్ట : ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయంలో శుక్రవారం కార్తిక పౌర్ణమి సందర్భంగా సీతారాముల కల్యాణం కనులపండువగా నిర్వహించారు. ముందుగా ఆలయంలోని బాలాలయం ప్రాంగణంలో ప్రత్యేక వేదిక ఏర్పాటు చేసి సీతారాముల ఉత్సవ మూర్తులను ఆశీనులు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకాలు నిర్వహించి పట్టు వస్త్రాలు తొడిగి, తులసిపూల గజమాలతో సుందరంగా అలంకరించారు. అలంకరణ అనంతరం ఆలయ అర్చకులు శ్రావణ్ కుమార్, పవన్ కుమార్‌లు సీతారాముల పౌర్ణమి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

18న ఈపీఎఫ్ కార్యాలయం ఎదుట ధర్నా


మాట్లాడుతున్న పెన్షనర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఈపీఎస్ 95 పెన్షన్ దార్ల సమస్యలపై పీఎఫ్ కార్యాలయం ఎదుట ఈ నెల 18న ధర్నా చేపడుతున్నట్లు పెన్షనర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.పెన్షన్‌దారులకు కనీస పెన్షన్ రూ. 9వేలు, డీఏ చెల్లించాలన్నారు. హయ్యర్ పెన్షన్ అందరికి ఇవ్వాలని, ఈపీఎస్ పెన్షనర్లకు ఉచితంగా ఆరోగ్య శ్రీ పథకాన్ని అమలు చేయాలన్నారు. సీనియర్ సిటిజన్స్ అందరికీ రైలు ప్రయాణాల్లో రాయితీని తిరిగి కొనసాగించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న హయ్యర్ పెన్షన్ దరఖాస్తులు పరిశీలించి త్వరగా పరిష్కరించాలన్నారు. దేశవ్యాప్తంగా 35 లక్షల మందికి కేవలం రూ. 1000 మాత్రమే చెల్లిస్తున్నారు. గత పదేళ్ల నుంచి కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలని అఖిలభారత స్థాయిలో పెన్షన్ సంఘాలు ఢిల్లీలో ఆందోళన చేసినా ఈ ప్రభుత్వాల్లో ఎలాంటి చలనం లేదన్నారు. కార్యక్రమంలో హరిచంద్ర రెడ్డి, రామకష్ణారెడ్డి నారాయణ రెడ్డి, సాంబశివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.